సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం । 11 । జూలై । 2024



ఘనంగా బోనాలు

వేములవాడ: స్థానిక చిలుకవాడకు చెందిన మహిళలు బుధవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. సకాలంలో వర్షాలు కురవాలని మొక్కుకున్నారు.



ఖాతాదారుల సంక్షేమమే లక్ష్యం

సిరిసిల్లటౌన్: ఖాతాదారుల సంక్షేమమే లక్ష్యమని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. ఇటీవల చనిపోయిన ఖాతాదారుల కుటుంబీకులకు బీమా చెక్కులు అందించారు.

గరిష్టం/కనిష్టం
33.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రకృతిని కాపాడుకోవాలి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మొక్క నాటుతున్న విప్ ఆది శ్రీనివాస్, చైర్‌పర్సన్ మాధవి, వైస్‌చైర్మన్ మహేశ్

వేములవాడ: ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడలోని బాలానగర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, వైస్‌చైర్మన్ బింగి మహేశ్‌లతో కలిసి బుధవారం మొక్కలు నాటి మాట్లాడారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అంతరించిపోతున్న అడవులను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలు పెంచితేనే స్వచ్ఛమైన గాలి వస్తుందన్నారు. వనమహోత్సవంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు.

నేతకార్మికులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న పంతం రవి

సిరిసిల్లటౌన్: పనుల్లేకుండా పస్తులుంటున్న సిరిసిల్ల నేతకార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి కోరారు. స్థానిక కార్మికభవనంలో బుధవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. పది మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటే ఇప్పటి వరకు చేనేత, జౌళిశాఖ మంత్రి స్పందించడకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు బకాయిలు రూ.150కోట్లు విడుదల చేసిందని చెబుతున్నారన్నారు. కానీ ఎన్ని నిధులు వచ్చాయో స్పష్టత లేదన్నారు. కార్మిక కుటుంబాలను పరామర్శించకుండా ఉండడం సబబు కాదన్నారు. సిరిసిల్ల వస్త్రపరిశ్రమపై సీఎం స్పందించి సహాయ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అజ్జ వేణు, ఎనగంటి రాజు, సోమ నాగరాజు, గందం సదానందం, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



హైకోర్టు జడ్జికి వినతిపత్రం ఇస్తున్న బార్ అసోసియేషన్ కార్యవర్గం

వేములవాడ: వేములవాడ కోర్టులోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైకోర్టు జడ్జి, జిల్లా పోర్ట్‌పోలియో జడ్జి రాధారాణికి వేములవాడ బార్ అసోసియేషన్ కార్యవర్గం, సీనియర్ అడ్వకేట్లు బుధవారం వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో కలిసి శాలువా కప్పి, రాజన్న ప్రసాదం అందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం మాట్లాడుతూ వేములవాడ రెవెన్యూ డివిజన్, పోలీస్ సబ్‌డివిజన్‌లో భాగమైన కోనరావుపేట మండలం ప్రస్తుతం సిరిసిల్ల కోర్టు పరిధిలో కొనసాగుతుందని, వేములవాడ కోర్టు పరిధిలోకి తీసుకురావాలని కోరారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఎక్కువగా కేసులు ఉన్నందున అదనపు కోర్టు ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న కోర్టు భవనంపై మొదటి అంతస్తు నిర్మాణానికి ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందించాలని విన్నవించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవదూత రజనీకాంత్, న్యాయవాదులు నాగు ల సత్యనారాయణ, వేముల సుధాకర్‌రెడ్డి, పాత్తూరి అనిల్‌కుమార్, నక్క దివాకర్, గడ్డం సత్యనారాయణరెడ్డి, నాగుల సంపత్, పంపరి శంకరయ్య, గుజ్జె మనోహర్ పాల్గొన్నారు.

అమ్మ ఒడిలా అంగన్‌వాడీ కేంద్రాలు



మంత్రి సీతక్కతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీడబ్ల్యూవో లక్ష్మీరాజం

సిరిసిల్లకల్చరల్: అంగన్‌వాడీ కేంద్రాలు అమ్మ ఒడిలా విశ్వాసాన్ని నింపాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క సూచించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆ శాఖ అధికారులతో మాట్లాడారు. కలెక్టరేట్ నుంచి జిల్లా సంక్షేమాధికారి పి.లక్ష్మీరాజం, సీడీపీవో సుచరిత పాల్గొన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ నాణ్యమైన సరుకులు, పౌష్టికాహారం అందించాలని సూచించారు. సోమవారం నుంచి వారంపాటు బడిబాటలా అంగన్‌వాడీ బాట నిర్వహించాలని సూచించారు.

సాగు భూములకే భరోసా

- వెంచర్లు, కళాశాలలకు బంద్
- సాగులో లేని 14 వేల ఎకరాల భూమి గుర్తింపు
- కళాశాలలు, రియల్ వెంచర్లు, గుట్టలకు జీపీఎస్ మార్కింగ్
- ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అధికారులు
- సాగు, భూ పరిమితులపై 19న ప్రజాప్రతినిధులతో భేటీ
- ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరుల అభిప్రాయ సేకరణ



సాక్షిప్రతినిధి,కరీంనగర్:

రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతుబంధు గతంలో దుర్వినియోగానికి గురైంది. పలువురు తమ రియల్ వెంచర్లు, గుట్టలు, రోడ్లు, కళాశాలలకు కూడా ఎకరానికి రూ.ఐదువేల చొప్పున రైతుబంధు తీసుకున్నారు. తాజా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సాయాన్ని ఎకారానికి రూ.7500 చేసింది. అమలు చేసే ముందు క్షేత్రస్థాయిలో పారదర్శకత ఉండేలా సాగులో ఉన్న భూమికే ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జూలై 3వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా శాంపిల్ సర్వే కింద ఐదు జిల్లాల్లో ఓ సర్వే నిర్వహించింది. అందులో కరీంనగర్ కూడా ఉంది. దీనికి గతేడాది వర్షాకాలంలో సాగుచేసిన పంటలను ప్రామాణికంగా తీసుకుని తిరిగి ×ల్యాండ్ యుటిలైజేషన్ సర్వే ఫీల్డ్ వెరిఫికేషన్¤ పేరిట సర్వే చేశారు. ఈ సర్వే ఆధారంగానే రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందించనుంది.

కరీంనగర్‌లో 14,100 ఎకరాలు

రాష్ట్రవ్యాప్తంగా సాగులో లేని దాదాపు 20లక్షల ఎకరాల వివరాలు సర్వే చేయగా, అందులో కరీంనగర్‌లో 3.40 లక్షల ఎకరాలకుపైగా సాగుభూమిలో దాదాపు 51,000 అనుమానాస్పద ఎకరాలను గుర్తించి సర్వే చేశారు. వీటిని ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేశారు. అందులో గుట్టలు, కొండలు, రోడ్లు, బంజరుభూమి, రియల్ వెంచర్లు, కళాశాలలు తదితర ఆప్షన్లు ఉన్నాయి. ఈ క్రమంలో కరీంనగర్‌లో దాదాపు 14,100 ఎకరాల భూమి సాగులో లేదని గుర్తించారు. అందులో అధికశాతం రియల్ ఎస్టేట్ వెంచర్లు, కళాశాలలు, కొండలు, బంజరు భూములు ఉన్నాయి. వీటిని ఆన్‌లైన్‌లో జీపీఎస్ ద్వారా మార్కింగ్ చేశారు. ఇక మీదట వీటిని వ్యవసాయాధికారులు చూసినప్పుడు అది సాగుభూమా? ఇతరత్రా అన్నది స్పష్టంగా తెలుస్తుంది. సాగుభూమి అయితే రైతు భరోసాకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

19న ప్రజాప్రతినిధులతో భేటీ

రైతుభరోసా అమలు చేసేందుకు ఈనెల 19 మంత్రివర్గ ఉపసంఘం కరీంనగర్ జిల్లాలో పర్యటించనుంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని 13 నియోజవర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్, పీఏసీ చైర్మన్లు, వ్యవసాయ అనుబంధ సొసైటీ ప్రతినిధులతో మంత్రివర్గ ఉపసంఘం భేటీ అవుతుంది. వీరి నుంచి అభిప్రాయాలు సేకరిస్తుంది. పెట్టుబడి సాయం రూ.5000 నుంచి రూ.7500కు పెంచుతున్న క్రమంలో సాగు పరిమితి, భూ పరిమితిపై అభిప్రాయాలు సేకరించనున్నారు. సాగు భూమికి ఎన్ని ఎకరాలకు సీల్ విధించాలి? ఎంత భూమికి రైతు భరోసా చెల్లించాలి? అన్న విషయాలపై అభిప్రాయాలు తీసుకోనున్నారు. ఇందుకోసం కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు జిల్లా వ్యవసాయాధికారుల (డీఏవో)లు ఇప్పటికే ఆయా జిల్లాల వ్యవసాయ భూముల పరిస్థితిపై నివేదికలు సిద్ధం చేశారు. వీరికి కరీంనగర్ జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు.

అదేరోజు నివేదిక పంపిస్తాం



19న మంత్రివర్గ ఉపసంఘం ప్రజాప్రతినిధులతో సమావేశం అవుతారు. వీరితోపాటు వివిధ వర్గాల అభిప్రాయలు సేకరిస్తారు. సమావేశానికి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, సొసైటీల చైర్మన్లు, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల వ్యవసాయాధికారులు కూడా హాజరవుతారు. అదే రోజు సాయంత్రం సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి పంపిస్తాం.

– శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్

● కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్లకల్చరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల్లో 2021లో 304 మంది, 2022లో 324, 2023లో 328 ప్రమాదాలు జరిగిన నేపథ్యంలో బుధవారం ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన కూడళ్లు, ఆర్‌అండ్‌బీ రోడ్డు మున్సిపల్ పరిధిలో ఆక్రమణలు పూర్తిగా తొలగించాలని, రోడ్లపై వాహనాల పార్కింగ్‌ను కట్టడి చేయాలని సూచించారు. అప్రోచ్ రోడ్లు, ప్రధాన జంక్షన్ల వద్ద స్పీడ్‌బ్రేకర్లు లేక ప్రమాదాలు జరుగుతున్నాయని, పార్కింగ్ స్థలాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జీల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రేడియం స్టిక్కర్లు, సైన్‌బోర్డుల ఏర్పాటు ద్వారా ప్రస్తుతానికి ప్రమాదాలు జరిగే చోట అప్రమత్తం చేయాలన్నారు. రోడ్లపై పెరిగిన చెట్ల కొమ్మలు తొలగించి రోడ్డు వ్యూ సరిగ్గా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయదారులు రోడ్లపై కేజీవీల్స్ నడపకుండ చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై అవసరమున్న చోట్ల స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం, డ్రంకెన్‌డ్రైవింగ్, వాహనాలు నడిపేటప్పుడు మొబైల్ ఉపయోగిస్తే శిక్షలు ఉంటాయని వివరించాలన్నారు. ప్రమాదాలు అధికంగా జరిగే తంగళ్లపల్లి, తిప్పాపూర్ క్రాస్‌రోడ్స్, గంభీరావుపేట, కోనరావుపేట, ముస్తాబాద్, చందుర్తి, బోయినపల్లి, కొదురుపాక జంక్షన్ వంటి ప్రదేశాల్లో బ్లాక్‌స్పాట్స్‌గా గుర్తించి రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్, మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేశ్, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, ఆర్‌అండ్‌బీ డీఈ ఆర్టీసీ డీఎం తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత స్థాయిలో మొక్కలు నాటాలి

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం నిర్దేశించిన స్థాయిలో మొక్కలు నాటాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. ఈమేరకు బుధవారం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశంలో మాట్లాడారు. వన మహోత్సవానికి ఏర్పాట్లు చేయాలన్నారు. గతంలో నాటిన మొక్కలు ఎండిన, పెరగకపోయినా వాటి స్థానంలో కొత్తవి నాటాలని సూచించారు. డీఆర్డీవో 5 లక్షలు, అటవీ లక్ష, సిరిసిల్ల మున్సిపల్ 50వేలు, వేములవాడ మున్సిపాలిటీ, వ్యవసాయ శాఖ, ఎక్సైజ్‌శాఖలకు 20 వేల చొప్పున, ఆర్‌అండ్‌బీ, నీటిపారుదల శాఖకు 10వేలు చొప్పున, విద్యాశాఖ, వైద్యారోగ్యశాఖ, పోలీస్, ఉద్యానవన శాఖలకు 5వేలు చొప్పున, పౌరసరఫరాలు, మైనింగ్, పరిశ్రమలు, దేవాదాయ, సెస్, మైనార్టీ, సంక్షేమశాఖ, రెవెన్యూశాఖలకు వెయ్యి చొప్పున లక్ష్యాన్ని నిర్దేశించారు. మొత్తంగా జిల్లాలో 7.58 లక్షల మొక్కలు నాటాలన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఆర్డీవో శేషాద్రి, డీఈవో రమేశ్‌కుమార్, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, ఉద్యానవన శాఖాధికారి జ్యోతి, డీఏవో భాస్కర్, ఎక్సైజ్‌శాఖాధికారి పంచాక్షరి, డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు, ఇరిగేషన్ ఈఈ ప్రకాశ్‌రావు, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ డి.లావణ్య, వేములవాడ కమిషనర్ అన్వేశ్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి

● ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి



రుద్రంగి పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

రుద్రంగి(వేములవాడ): నేరాల నియంత్రణకు పోలీసులకు ప్రజల సహకారం ఉండాలని ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి కోరారు. రుద్రంగి పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. స్టేషన్‌లోని సిబ్బంది వివరాలు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలకు యువత అలవాటు పడకుండా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పిల్లల్లో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, రుద్రంగి ఎస్సై అశోక్, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు ఉత్తమర్యాంకులు సాధించాలి



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న డీఈవో

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పదోతరగతి విద్యార్థులు ఇష్టపడి చదివి ఉత్తమ ర్యాంకులు సాధించాలని డీఈవో రమేశ్‌కుమార్ కోరారు. మండలంలోని నారాయణపూర్ హైస్కూల్‌లో బుధవారం మొక్కలు నాటి, పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు.

పౌష్టికాహారం తీసుకునేలా చూడాలి

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకునేలా చూడాలని డీఈవో రమేశ్‌కుమార్ సూచించారు. మండల స్థాయి ఉపాధ్యాయులకు 'రక్తహీనత రహిత భారత దేశం' అనే అంశంపై అవగాహన కల్పించారు. నిత్యం తీసుకునే ఆహారంలో పల్లీలు, బెల్లం ఉండేలా చూడాలన్నారు. ఎంఈవో దూస రఘుపతి, నోడల్ అధికారి కృష్ణహరి, సెక్టోరియల్ అధికారి సతీశ్‌కుమార్, హెచ్‌ఎంలు మనోహరాచారి, చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి భరత్, ఫీల్డ్ అధికారి నవత, ఎస్‌ఎంసీ చైర్మన్ భాగ్య పాల్గొన్నారు.

మరమగ్గాలకు 10 హెచ్‌పీ వరకు విద్యుత్ సబ్సిడీ

సిరిసిల్లకల్చరల్: మరమగ్గాల కోసం రెండు కన్నా ఎక్కువ సర్వీస్ కనెక్షన్లు వాడుతున్న యజమానులు అధికంగా ఉన్న మీటర్లను సెస్ ఆఫీస్‌లో సరెండర్ చేయాలని సెస్ పరిపాలన సంచాలకుడు శ్రీనివాస్ రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. వాపస్ చేసిన మీటర్లపై ఉన్న బకాయిలు చెల్లించాలని సూచించారు. 10 హెచ్‌పీలోపు వాడుకున్న వారికి సబ్సిడీ వర్తింపజేయనున్నట్లు తెలిపారు.

మాస్టారూ.. వెళ్లొద్దు

● కన్నీరు పెట్టిన విద్యార్థులు



చందుర్తి(వేములవాడ): 'మాస్టారూ.. వెళ్లొద్దు..' అంటూ విద్యార్థులు ఉపాధ్యాయుడిని చుట్టుముట్టిన కన్నీరుపెట్టిన సంఘటన చందుర్తిలోని ప్రాథమిక పాఠశాలలో చోటుచేసుకుంది. పదమూడేళ్లుగా అదే పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుడు కడారి నరేశ్ ఇటీవల బోయినపల్లి మండలం జగ్గారావుపల్లికి బదిలీ అయ్యారు. చివరి రోజు స్కూల్‌కు రాగా విషయం తెలుసుకున్న విద్యార్థులు నరేశ్‌ను చుట్టుముట్టి రోదించారు. వారిని చూసి నరేశ్ సైతం భావోద్వేగానికి గురయ్యారు.

ఆలయ ఉద్యోగుల బదిలీ జీవో

వేములవాడ: రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇప్పటి వరకు ఒక దేవాలయాన్ని ఒకే యూనిట్‌గా తీసుకుని బదిలీలు జరిగేవి. చాలా ఏళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగులతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కలగడం లేదని భావించిన రాష్ట్ర దేవాదాయశాఖ ఒక ఆలయం నుంచి మరో ఆలయానికి బదిలీ చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఈమేరకు ఉద్యోగుల జాబితా సేకరించింది. రెండు రోజుల క్రితం ఉద్యోగుల బదిలీల ప్రక్రియపై జీవో విడుదలైనట్లు ఆలయ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. త్వరలోనే స్థానచలనం కలగనుంది. ఈక్రమంలోనే రాజన్న ఆలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు మరో దేవస్థానానికి బదిలీ జరిగే అవకాశాలు కనిపిస్తుండడంతో బదిలీలను ఆపేందుకు పెద్ద ఎత్తున పైరవీలు చేస్తున్నట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు. మరో వారం రోజుల్లో బదిలీల ప్రక్రియ ప్రారంభమవుతుందన్న సంకేతాలు అందినట్లు సమాచారం.

వంతెనలకు మోక్షమెప్పుడో?



ఇది ఎల్లారెడ్డిపేట మండలం పదిర-రామలక్ష్మణపల్లి మధ్య మానేరువాగుపై ఉన్న లోలెవల్ వంతెన. వరదనీటితో కల్వర్టు కొట్టుకు పోవడంతో సిరిసిల్ల-సిద్దిపేట రెండు జిల్లాలు, 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వంతెన లేకపోవడంతో ఏటా వర్షాకాలంలో ఇదే సమస్య ఎదురవుతుంది. గతేడాది వరదలతో కొట్టుకుపోయిన లోలెవల్ కల్వర్టుకు మరమ్మతులు చేయలేదు.



లోలెవల్ కల్వర్టు పై నుంచి పారుతున్న వరద ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి శివారులోని లేతమామిండ్లవాగు. ఏటా వర్షాకాలంలో చిన్నపాటి వానకే వాగు పొంగుతుండడంతో కోనరావుపేట-ఎల్లారెడ్డిపేట మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ వాగుపై శాశ్వత పరిష్కారంగా వంతెన నిర్మించాలన్న విన్నపాలు బుట్టదాఖలవుతున్నాయి. ఇలాంటి లోలెవల్ కల్వర్టులు జిల్లాలో 95 వరకు ఉన్నాయి. అన్ని ప్రాంతాల్లోనూ ఇదే సమస్య.

- చిరుజల్లులకే పొంగిపొర్లుతున్న వాగులు
- పల్లెలకు నిలిచిపోతున్న రాకపోకలు
- వర్షాకాలంలో తప్పని ప్రయాణపాట్లు
- పట్టించుకోని అధికారులు

జిల్లాలో రోడ్ల వివరాలు

రోడ్ల విస్తీర్ణం	595.869 కి.మీ
బీటీ రోడ్లు	570.061 కి.మీ
మట్టి రోడ్లు	5.05 కి.మీ
సీసీ రోడ్లు	20.308 కి.మీ
పీఆర్ రోడ్లు	1,041
ఆర్‌అండ్‌బీ రోడ్లు	595
లోలెవల్ వంతెనలు, కల్వర్టులు	95



నారాయణపూర్- బండలింగంపల్లి మధ్య పాలేటి వాగుపై లోలెవల్ వంతెన

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): చిన్నపాటి వర్షానికే పల్లెల్లో రాకపోకలు నిలిచిపోతున్నాయి. చిరుజల్లులకే వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో లోలెవల్ కల్వర్టులు మునిగిపోతున్నాయి. ప్రజాజీవనం స్తంభించిపోతుంది. ఏటా వర్షాకాలంలో ఇవే సమస్యలు ఎదురవుతున్నా శాశ్వత పరిష్కారమార్గాలను అధికారులు చూపడం లేదు. ఫలితంగా జిల్లా ప్రజలకు వానాకాలం కష్టాలు తప్పడం లేదు.

ఏటా ఇవే కష్టాలు

రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 95 లోలెవల్ కల్వర్టులు ఉండగా.. వర్షాకాలంలో అన్ని వరదనీటితో ముంచెత్తుతున్నాయి. ప్రధానంగా చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట, ముస్తాబాద్ మండలాలో ఎక్కువగా లోలెవల్ కల్వర్టులు వర్షాకాలంలో మునిగిపోతున్నాయి. ఎల్లారెడ్డిపేట ఉమ్మడి మండలంలో నాలుగుమార్గాల్లో 8 లోలెవల్ కల్వర్టులతో 17 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి.

ప్రయాణం నరకం

- ఎల్లారెడ్డిపేట మండలం పదిర, ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లె మధ్య మానేరు పొంగిపొర్లుతుండడంతో ఈ ప్రాంత ప్రజలు సిద్దిపేట, ముస్తాబాద్, దుబ్బాక వెళ్లలేకపోతున్నారు. ఇక్కడ మానేరువాగుపై వంతెన నిర్మాణానికి సుమారు రూ.50కోట్ల వరకు ఖర్చు అవుతుందని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.
- అక్కపల్లి వద్ద లేతమామిండ్లవాగు పొంగుతుండడంతో ప్రతీ సీజన్‌లో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఆపద సమయంలో ఆస్పత్రులకు వెళ్లడానికి అవకాశం లేకుండా పోతుంది. ముఖ్యంగా గర్భిణీలు ప్రసవ సమయంలో ఆస్పత్రికి చేరుకోవడానికి ఎలాంటి మార్గాలు లేక ఇబ్బంది పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

జిల్లాలో 95 లోలెవల్ వంతెనలు, కల్వర్టులు ఉన్నాయి. ఏటా వర్షాకాలంలో ఆయా ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు రోడ్ల దుస్థితిపై స్పందించడం లేదు. ఎన్నిసార్లు విన్నవించినా కనీసం పరిశీలించడం కూడా లేదు. మరోవైపు తండాలు, చిన్నచిన్న పల్లెల మధ్య తెగిపోయిన రోడ్లను గ్రామపంచాయతీ నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేసుకోవాలని అధికారులు ఆదేశాలివ్వడం గమనార్హం.

శాశ్వత పరిష్కారం చూపాలి



పదిర-రామలక్ష్మణపల్లె మధ్య మానేరువాగుపై వంతెన నిర్మాణం కలగానే మిగులుతోంది. శాశ్వతంగా వంతెన నిర్మించాలి. గతేడాది కురిసిన భారీ వర్షానికి వచ్చిన వరదలతో మానేరువాగుపై లోలెవల్ వంతెన కొట్టుకుపోయింది. అప్పటి నుంచి మరమ్మతులు చేయకపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

– సత్యంరెడ్డి, పదిర

ప్రతిపాదనలు పంపాం

పదిర-రామలక్ష్మణపల్లి మధ్య మానేరు వాగుపై వంతెన నిర్మాణానికి రూ.50కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం అంత పెద్ద మొత్తంలో నిధులు ఇవ్వడానికి సుముఖంగా లేదు. లోలెవల్ కల్వర్టులు పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో ఉంటాయి. వర్షాలతో తండాలు, పల్లెల మధ్య ఉన్న రోడ్లు తెగిపోతే గ్రామపంచాయతీ నిధులతో మరమ్మతులు చేసుకోవాలని సూచించాం.

– కిరణ్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, ఎల్లారెడ్డిపేట



దిగబడ్డ లారీ.. వాహనాలకు దారేది?

బోయినపల్లి(చొప్పదండి): కరీంనగర్‌-సిరిసిల్ల ప్రధాన రహదారి మండలంలోని వెంకట్రావుపల్లి పరిసరాల్లో నిర్మిస్తున్న ఫోర్‌లేన్ బ్రిడ్జి సమీపంలో గ్రానైట్ బండతో వెళ్తున్న లారీ దిగబడింది. దీంతో ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. మంగళవారం రాత్రి లారీ దిగబడితే బుధవారం మధ్యాహ్నం క్రేన్ల సాయంతో లాగడంతో వాహనాల రాకపోకలు సాఫీగా సాగాయి.



ప్రహరీ లేక ఇబ్బందులు

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్నేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు ప్రహరీ కూలిపోయింది. దీంతో ఆస్పత్రికి రక్షణ లేకుండా పోయింది. ఎదురుగా ఉన్న పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారు తమ వాహనాలను ఆస్పత్రి ఆవరణలో నిలుపుతుండడంతో రోగులు, బంధువులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఆస్పత్రికి ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.



రాజన్న ఆదాయం రూ.1.79 కోట్లు

వేములవాడ: రాజన్నకు 39 రోజుల్లో హుండీల ద్వారా రూ.1.79 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి బుధవారం తెలిపారు. నగదుతోపాటు 217 గ్రాముల బంగారం, 18 కిలోల వెండి సమకూరినట్లు చెప్పారు. రాజన్న ఆలయ దత్తత ఆలయం నాంపల్లి లక్ష్మీనర్సింహస్వామి హుండీల ద్వారా రూ.11.33 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు. లెక్కింపులో కరీంనగర్‌కు చెందిన గోవిందపతి శ్రీస్వామి సేవా సమితి ప్రతినిధులు భాగ్యలక్ష్మి, శైలజారెడ్డి ఆధ్వర్యంలో 700 మంది సభ్యులు పాల్గొన్నారు.

కోడెల కోసం రైతులు రావొద్దు

- ఉచిత పంపిణీ నిలిపివేశాం
- తిరిగి ప్రకటించాకే రావాలి



ఈవో కార్యాలయం ఎదుట ఫ్లెక్సీ కడుతున్న ఆలయ ఉద్యోగులు

వేములవాడ: రాజన్న గోశాలలో కోడెల సంఖ్య పెరిగిపోవడంతో అర్హులైన రైతులకు ఇటీవల ఆలయ అధికారులు ఉచితంగా పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల రైతులు సైతం పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకుని రాజన్న కోడెలను తీసుకెళ్లారు. దీంతో కోడెలు చాలా వరకు తగ్గిపోయాయి. ఉచిత కోడెల పంపిణీ ఇక నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు ఈవో కార్యాలయం ఎదుట బుధవారం ఓ ఫ్లెక్సీ కట్టేశారు. తిరిగి పంపిణీ చేసే ప్రక్రియను ప్రకటిస్తామని, అప్పటి వరకు ఈ ప్రక్రియ నిలిపివేస్తున్నట్లు ఈవో పేరుతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అప్పటి వరకు రైతులెవ్వరూ ఉచిత కోడెల కోసం కార్యాలయం చుట్టూ తిరగొద్దని కోరారు.

ప్రీకాస్ట్ నిర్మాణం వివాదాస్పదం



ప్రస్తుతం నిర్మితమైన ప్రీకాస్ట్ ప్రహరీ



ఆరు నెలల క్రితం కూల్చిన ప్రహరీ (ఫైల్)

సిరిసిల్లటౌన్: బల్దియా తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆరు నెలల క్రితం ఓ ప్రీకాస్ట్ నిర్మాణం తప్పని తేల్చిన అధికారులు ఇప్పుడు అదే ఒప్పుగా సమర్థించడంపై పలువురు ప్రశ్నిస్తున్నారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం బుధవారం మాట్లాడుతూ.. సిరిసిల్లలోని మినీస్టేడియం పక్కనే సుమారు 11 ఎకరాల స్థలానికి యజమానులు ఆరు నెలల క్రితం అనుమతుల్లేకుండా ప్రీకాస్ట్ ప్రహరీ నిర్మించడంతో అధికారులు కూల్చివేశారు. కొన్ని రోజులకే అక్కడే అదే ప్రీకాస్ట్ నిర్మాణం పూర్తయినా ఇప్పుడు ఎవరూ నోరు మెదపడం లేదన్నారు. ఆ నిర్మాణానికి అనుమతులు తీసుకుంటే మున్సిపాలిటీకి రూ.2కోట్ల వరకు ఆదాయం వచ్చేదని, అప్పట్లో కూల్చిన నిర్మాణం ఇప్పుడు పర్మిషన్ లేకుండా నిర్మించినా ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అధికారులు నిబంధనల అతిక్రమణపై స్పందించి చర్యలు తీసుకోకుంటే అక్రమాలపై పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.

మాతాశిశు కేంద్రంలో శిశువు అపహరణకు యత్నం

- మహిళ, మరో వ్యక్తిని పోలీసులకు అప్పగింత

కరీంనగర్‌టౌన్: మాతా శిశు ఆరోగ్యకేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ మహిళతో పాటు మరోవ్యక్తిని సెక్యూరిటీ సిబ్బంది పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకెళితే... మద్యం మత్తులో ఉన్న ఓ మహిళ, మరో వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి మాతా శిశు కేంద్రం వద్దకు వచ్చి, అక్కడే ఉన్న ఓ తల్లి వద్ద ఉన్న బాబును మా బాబు అంటూ తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. భయాందోళనలకు గురైన ఆ తల్లి మాతాశిశు కేంద్రం లోపలికి పరుగు తీసింది. స్థానికులు అడ్డుకొని మద్యమత్తులో ఉన్న మహిళలను ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో ఆమెతో పాటు మరో వ్యక్తిని పట్టుకున్నారు. చిన్నపిల్లలను అపహరించేందుకు ఇద్దరు వ్యక్తులు వచ్చారంటూ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకొని ఇద్దరిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నేతకార్మికుడి ఆత్మహత్యాయత్నం

- అప్పుల బాధతో అఘాయిత్యం
- పరిస్థితి విషమం



చికిత్స పొందుతున్న గాజుల వేణు

సిరిసిల్లటౌన్: అప్పుల బాధ తాళలేక నేత కార్మికుడు గాజుల వేణు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన తంగళ్లపల్లి మండలం కేసీఆర్‌నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. తంగళ్లపల్లి మండలం మండేపల్లి శివారులోని కేసీఆర్‌నగర్‌లో వేణు నివసిస్తున్నాడు. వైపని కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబ అవసరాల కోసం సుమారు రూ.8లక్షలు అప్పు చేశాడు. చాలా రోజులుగా సిరిసిల్ల వస్త్రపరిశ్రమలో పనుల్లేకపోవడంతో అప్పులు తీర్చలేకుండా నిస్సహాయ స్థితిలో ఉంటున్నాడు. బుధవారం అప్పులోళ్లు ఇంటిమీదకు వస్తారన్న భయంతో ఇంట్లోనే ఉరేసుకుంటుండగా కుటుంబ సభ్యులు చూసి కాపాడారు. అపస్మారక స్థితిలో ఉన్న వేణును సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. భార్య వైష్ణవి, కొడుకులు హర్షవర్ధన్, ఆరుష్ ఉన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తి అరెస్ట్

వేములవాడ: వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అనుపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన బొమ్మేన లక్ష్మి అనే మహిళకు తిప్పాపూర్ శివారులో ఉన్న ప్లాట్‌ను తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుని డబ్బులు ఇవ్వకుండా కులం పేరుతో దూషించిన వేములవాడకు చెందిన ఒడ్యాల వేణు ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం ప్రకటనలో తెలిపారు. లక్ష్మి తన కూతురి పెళ్లి కోసం ప్లాట్‌ను విక్రయించగా.. వేణు పేరిట రిజిస్ట్రేషన్ చేసుకుని రూ.6లక్షలు ఇస్తానని, వాటిని పెళ్లి అయిపోయిన తర్వాత తిరిగిస్తే భూమిని లక్ష్మి పేరిట మళ్లీ రిజిస్ట్రేషన్ చేస్తానని నమ్మించి మోసం చేశారని పేర్కొన్నారు. ఈ విషయమై వేణును నిలదీయగా లక్ష్మిని కులం పేరుతో దూషించడం, చంపుతానని బెదిరించాడని 2022లో వేములవాడటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. తిరిగి వేణు పెద్దమనుషుల సమక్షంలో అదే ప్లాట్‌ను లక్ష్మికి రిజిస్ట్రేషన్ చేయడానికి రూ.8.50 లక్షలు ఒప్పందం చేసుకొని రూ.లక్ష అదనంగా తీసుకొని మళ్లీ బెదిరింపులకు పాల్పడడంతో బాధితురాలు వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రెండోసారి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదుతో వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి విచారణ చేపట్టి వేణుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా వేణుపై పలు కేసులు ఉండడంతో రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు ప్రకటించారు. వేణులో మార్పు రాకపోతే పీడీయాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. వేణు బాధితులు ఉంటే పోలీసులను ఆశ్రయించాలని ఎస్పీ కోరారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



లక్ష్మయ్య(ఫైల్)

కరీంనగర్‌రూరల్: భూవివాదంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ రైతు చికిత్స పొందుతూ బుధవారం వేకువజామున ఆస్పత్రిలో మృతిచెందాడు. ఆ రైతు మృతికి కారణమైన వ్యక్తి ఇంటి వద్ద మృతుడికి అంత్యక్రియలు నిర్వహిస్తారనే సమాచారంతో పోలీసులు గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసుల కథనం ప్రకారం కరీంనగర్ మండలం ఇరుకుల్లకు చెందిన బుర్ర లక్ష్మయ్య(60)కు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు కాగా భార్య ఎనిమిదేళ్ల క్రితం మృతిచెందింది. ఇద్దరు కూతుర్లకు వివాహాలు కాగా కుమారుడు సాయిబాబు ఉపాధినివిత్తం కువైట్ వెళ్లాడు. 2002 సంవత్సరంలో బుర్ర ఓదయ్య నుంచి సర్వే నంబరు 79/ఏలోని 4గుంటల స్థలాన్ని రూ.8వేలకు సాదా బైనామా ద్వారా లక్ష్మయ్య కొనుగోలు చేశాడు. 15రోజుల క్రితం స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయాలని లక్ష్మయ్య కోరగా ఓదయ్య నిరాకరించడంతో మంగళవారం కుల పంచాయితీ పెట్టారు. రూ. 2లక్షలు ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తానని ఓదయ్య చెప్పగా రూ.లక్ష ఇచ్చేందుకు లక్ష్మయ్య ముందుకురాగా ఓదయ్య ఒప్పుకోలేదు. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మయ్య ఇంటికి వచ్చి గడ్డి మందు తాగడంతో స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం వేకువజామున 4గంటలకు మృతిచెందాడు. భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా తన తండ్రి మృతికి కారణమైన ఓదయ్యపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కూతురు స్వప్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లక్ష్మయ్య మృతికికారకుడైన ఓదయ్య ఇంట్లో అంత్యక్రియలు నిర్వహిస్తారనే ముందస్తు సమాచారంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోస్ట్‌మార్టం అనంతరం లక్ష్మయ్య మృతదేహాన్ని కుటుంబసభ్యులు ఇంటికి తీసుకొచ్చి అంత్యక్రియలను పూర్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

మానకొండూర్: మండల కేంద్రానికి చెందిన మోదుంపల్లి హన్మంతు(56) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. హన్మంతు బుధవారం ఉదయం బహిర్భూమికి వెళ్లి, తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. అతని తలకు బలమైన గాయమవడంతో కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడికి భార్య లస్మమ్మ, కుమారుడు గోపి ఉన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

జ్వరంతో యువకుడి మృతి



శివతేజ(ఫైల్)

కథలాపూర్: మండలంలోని పోసానిపేటకు చెందిన దీకొండ శివతేజ(24) జ్వరంతో బాధపడుతూ బుధవారం మృతిచెందాడు. శివతేజ వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఇదే సమయంలో రక్తకణాలు తగ్గడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రామడుగు ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

విద్యానగర్(కరీంనగర్): తనపై దొంగతనం మోపి, నేరాన్ని ఒప్పుకోవాలంటూ రామడుగు ఎస్సై మామిడాల సురేందర్ తీవ్రంగా హింసించారని బాధితుడు, వెలిచాలవాసి కుతాడి కనకయ్య ఆరోపించాడు. తనకు ప్రాణహాని ఉందని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరాడు. బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తప్పుడు ఫిర్యాదుపై ఎలాంటి విచారణ చేయలేదన్నాడు. గత నెల 11న వేకువజామున ఇంట్లో నిద్రిస్తున్న తనను రామడుగు పోలీసులు వచ్చి, ఠాణాకు తీసుకెళ్లి, విపరీతంగా కొట్టారని తెలిపాడు. అదేరోజు కరీంనగర్‌కు తరలించి, 12న మళ్లీ హింసించారని, రాత్రి 10 గంటలకు లేవలేని స్థితిలో తానుంటే ఇంటికి పంపించారని పేర్కొన్నాడు. దెబ్బలకు తీవ్ర జ్వరంతో బాధపడుతున్న తనను తిరిగి 25న స్టేషన్‌కు పిలిచి, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఎస్సై, 8 మంది కానిస్టేబుళ్లు కాళ్లు కట్టేసి, నేలపై పడుకోబెట్టి, చేతులు, వీపు, పాదాలపై కర్రలు, బెల్టులతో కొట్టారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఏప్రిల్ నెలలో ఎవరో గొర్రెలు ఎత్తుకెళ్తే.. తాను చేసినట్లు ఒప్పుకోమని కొడుతూ.. ఒప్పుకోకపోతే చంపేస్తామని బెదిరించారని వాపోయాడు. తాను ఎలాంటి నేరం చేయలేదని, తన పిల్లలపై ప్రమాణం చేస్తున్నట్లు పేర్కొన్నాడు. తమ కుటుంబానికి ఎవరూ అండగా ఉండటం లేదని, రాజీపడాలని తమ గ్రామానికి చెందిన నాయకులు ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించాడు. ప్రభుత్వం స్పందించి, తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరాడు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేశ్, ఐద్వా జిల్లా కార్యదర్శి కె.నాగరాణి, నాయకులు పుష్పలత, రాణి తదితరులు పాల్గొన్నారు.

హోటల్‌లో చోరీకి పాల్పడిన వ్యక్తి రిమాండ్

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం నాగంపేటలోని రాజేందర్ హోటల్‌లో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు. రెండు రోజుల క్రితం రాజేందర్‌కు చెందిన హోటల్ తలుపులు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. హోటల్‌లో నుంచి రూ.4వేలు పోయాయి. బాధితుడి ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు అదే గ్రామానికి చెందిన రవికుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.